క్లుప్తంగా

44వ రోజుకు చేరిన దీక్ష



తట్టెపల్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సాధన కమిటీ సభ్యులు

పెద్దేముల్: తట్టెపల్లి గ్రామ పంచాయతీని నూతన మండలంగా ప్రకటించాలని తట్టెపల్లి సాధన కమిటీ సభ్యులు చేపట్టిన నిరసన దీక్ష అదివారం నాటికి 44వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతం తట్టెపల్లిని ప్రభుత్వం వెంటనే మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గుర్తించే వరకు దీక్ష కొనసాగుతుందని సాధన కమిటీ సభ్యులు చెప్పారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవంలో భక్తులు

దౌల్తాబాద్: దేవర్‌ఫసల్‌వాద్‌లో ఆదివారం ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలు, సిరిసంపదలతో రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం



జలాధివాసం చేసిన విగ్రహాలు

మోమిన్‌పేట: మేకవనంపల్లిలో దేవతా మూర్తుల (గ్రామ దేవతలైన పోచమ్మ, దుర్గమ్మ, ఊరడమ్మ, బోరంచ పోచమ్మ) విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం సర్వోత్తమ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిగింది. మొదటి రోజైన శనివారం విగ్రహాలను ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. అనంతరం విగ్రహాలకు జలాధివాసం చేశారు. ప్రతి ఇంటి నుంచి భక్తులు గంగాజలం తీసుకువచ్చి విగ్రహాలపై పోశారు. రెండో రోజైన ఆదివారం సంయుక్త హోమ యజ్ఞం కార్యక్రమాలు చేపట్టారు.

స్వచ్ఛతకు ఒక్క అడుగు..



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

వికారాబాద్ అర్బన్: స్వచ్ఛతకు ఒక్క అడుగు.. పరిశుభ్రత వైపు అనే నినాదంతో ఆదివారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ప్రారంభించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. మొదటి రోజు మున్సిపల్ పరిధిలోని 8,9,16,22,23 వార్డుల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో మురికి కాలువల శుభ్రత, చెత్త సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, జేసీబీ సహాయంతో పేరుకుపోయిన చెత్తను తరలించడం తదితర పనులు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ శంషాద్‌బేగం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, కౌన్సిలర్లు కిరణ్‌పటేల్, ప్రభావతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాండు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మొహినొద్దీన్, సూపర్‌వైజర్ వెంకటేశం, వార్డు ఆఫీసర్లు, ఆర్పీలు, జవాన్లు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులు దాటుతున్న సర్కారు బియ్యం

ప్రభుత్వ బియ్యం సరిహద్దులు దాటుతోంది. గ్రామాలు, పట్టణాల నుంచి పేదల బియ్యం సేకరిస్తూ కొందరు వ్యాపారులు కోట్లకు పడగలెత్తున్నారు. పోలీసులు ఎప్పటికప్పుడు అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేస్తున్నా.. రేషన్ మాఫియా ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి.

- పేదల బియ్యంతో కోట్ల రూపాయల దందా
- తాండూరు పట్టణంలో నిల్వలు
- పోలీసులు పట్టుకున్నా ఆగని అక్రమ రవాణా

పెద్దేముల్: రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల్లో పోలీసులు రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాలను పలుమార్లు పట్టుకొని సీజ్‌చేసి, కేసులు నమోదు చేసినా.. దందా కొనసాగుతూనే ఉంది. పెద్దేముల్ మండలంలో సుమారు 29 చౌకధరల దుకాణాలు, 12,029 రేషన్ కార్డులు, రేషన్ కార్డులో 41,098 మంది సభ్యులున్నారు. ప్రతి నెల సుమారు 2,69,733 క్వింటాళ్ల బియ్యం కాగా.. అంత్యోదయ కార్డులు 1,305 ఉండగా.. వారికి నెలకు 45,675 క్వింటాళ్ల బియ్యం ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఇదిలా ఉండగా.. గ్రామాల్లో కొంత మంది వ్యాపారులు.. కిలో రేషన్ బియ్యానికి రూ.8నుంచి రూ.10వరకు వెచ్చించి బడా వ్యాపారులకు విక్రయిస్తున్నారు. నాలుగు నెలల క్రితం మన్‌సాన్‌పల్లి, బుద్దారం, కందనెల్లి గ్రామాల సమీపంలో పోలీసులు అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను సీజ్‌చేసి కేసులు నమోదు చేశారు. పది రోజుల క్రితం పెద్దేముల్ మండలంలో 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని కేసు పెట్టారు. ఆరు మాసాల క్రితం యాలాల మండలంలో 100 క్వింటాళ్ల రేషన్‌ను పట్టుకున్నారు.

కర్ణాటకకు తరలుతున్న రేషన్

పెద్దేముల్, బషీరాబాద్ మండలాలకు కర్ణాటక రాష్ట్రం సరిహద్దు దగ్గరగా ఉండటంతో రేషన్ మాఫియా తెలంగాణ రేషన్ బియ్యాన్ని ఆ రాష్ట్రం కుంచారం, సేడెంతో పాటు బీదర్‌కు తరలిస్తునట్లు సమాచారం. తాండూరు పట్టణాన్ని అడ్డాగా చేసుకొని అక్కడ నిల్వలు చేసి పెద్ద మొత్తంలో బియ్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని.. రేషన్ బియ్యం వ్యాపారాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డిని వివరణ కోరేందుకు యత్నించగా.. వారు అందుబాటులోకి రాలేదు.



పెద్దేముల్‌లో పది రోజుల క్రితం పట్టుకున్న రేషన్ బియ్యం

అందుబాటులో గన్నీబ్యాగులు

సాక్షి ఎఫెక్ట్..

దోమ: కొనుగోలు కేంద్రాల్లో లారీలు, గన్నీబ్యాగుల కొరత లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఆదివారం 'సాక్షి'లో 'మందకొడిగా ధాన్యం కొనుగోలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని 16 కొనుగోలు కేంద్రాల్లో రెండు రోజులుగా పేరుకుపోయిన ధాన్యం నిలువలను సంబంధిత అధికారులు లారీలు తెప్పించి మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకున్నారు. అవసరమైన గోనె సంచులను రైతులకు పంపిణీ చేశారు. ప్రతి సెంటర్లో కర్షకులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి సమస్య తలెత్తినా తమకు ఫిర్యాదు చేయాలని ఏఓ ప్రభాకర్ రావు సూచించారు.



బొంపల్లిలో రైతులకు గోనె సంచులు పంపిణీ చేస్తున్న కొనుగోలు కేంద్రం నిర్వాహకులు

వానరాల జోరు.. జనం బేజారు

- వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్న కోతులు
- గ్రామాల్లో హల్‌చల్.. ఇళ్లపైకి పంజాదేస్తున్న వైనం

ధారూరు: వనాలను వీడి పంట పొలాలపై పడుతున్న వానరాలు.. అక్కడి నుంచి రోడ్లపై, గ్రామాల్లో సంచరిస్తూ హల్‌చల్ చేస్తున్నాయి. కోతుల బెడదను నివారించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని బాధిత గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ధారూరు మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో కోతుల బెడద ఎక్కువైందని, పాడి పంటలను నాశనం చేయడంతో పాటు.. ఇళ్లపై, ఇళ్లలోకి దూరి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. వాటికి దొరికిన వస్తువులను ఎత్తుకెళ్లడంతో పాటు.. ఇళ్లంతా చిందరవందరం చేస్తున్నాయని చెప్పారు. ధారూరు మండలంలో ఎక్కువగా అడవులు విస్తరించి ఉన్నా.. కోతులు వందలు వేల సంఖ్యలో ఊరుబాట పట్టాయి. వీటిని అరికట్టేందుకు ఎవరూ సాహసించకపోవడంతో వాటిదే రాజ్యం అయింది. వాటిని ఎవరైనా హడలించే ప్రయత్నం చేస్తే.. దాడికి పాల్పడుతున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల చేతుల్లోంచి టిఫిన్ బాక్సులు లాక్కెళ్తున్నట్లు చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారులు తగిన చొరవ తీసుకొని.. జనారణ్యం నుంచి అరణ్యం బాట పట్టేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



బాచారం సమీప వంతెన పక్కనే గుంపులుగా సంచరిస్తున్న కోతులు

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

- ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలి
- రాజీవ్ వర్ధంతిలో కాంగ్రెస్ నేతలు



పరిగి: రాజీవ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీఆర్ఆర్ తదితరులు

పరిగి: రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి. రాంమ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్ 32వ వర్ధంతి సందర్భంగా టీఆర్ఆర్ నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రధానిగా దేశానికి అంకితభావంతో పనిచేశారని, గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా ఆయన తెచ్చిన అధికార వికేంద్రీకరణ చట్టాలు ఎంతో ఫలితాలను ఇచ్చాయని చెప్పారు. ఓటు హక్కును 21 సంవత్సరాల నుంచి 18సంవత్సరాలకు కుదించి ఓటు హక్కు కల్పించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులే నేటికీ దర్శనమిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, జగన్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ ఆశయ సాధనకు కృషి

తాండూరు టౌన్: మాజీ ప్రధాని, దివంగత నేత రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్ అన్నారు. రాజీవ్ వర్ధంతి సందర్భంగా స్థానిక రాజీవ్ కాలనీలో ఆయన విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సర్దార్ ఖాన్, రవికుమార్, శ్రీనివాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు..

కొడంగల్ రూరల్: రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వీబీఆర్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'రాజీవ్‌గాంధీ డెవలప్‌మెంట్ ఇన్ ఇండియా' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు అభినందించారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ భీమరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.



తాండూరు టౌన్: రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొడంగల్ రూరల్: వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థి దశ మరపురానిది



నాటి గురువులతో విద్యార్థులు

బొంరాస్‌పేట: మనిషి జీవితంలో విద్యార్థి దశ మరపురానిదని కవి వడిచర్ల సత్యం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008–09 విద్యాసంవత్సర పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కవి సత్యం మాట్లాడుతూ బాల్యంలోని జ్ఞాపకాలను తీపి గుర్తులుగా ఎంచాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు గురువులను సన్మానించారు. ఆటపాటలతో నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

శంకర్‌పల్లి: దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బీజేపీ సీనియర్ నాయకుడు వర్రి తులసీరాం విజయ్‌కుమార్ కోరారు. మండలంలోని మిర్జాగూడ అనుబంధ గ్రామమైన మియాఖాన్‌గడ్డలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ న మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పురాతన దేవాలయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్ గౌడ్, ఉప సర్పంచ్ శాంతికిషన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కురుమ వెంకటేశ్, రాయదుర్గం పీఏసీఎస్ చైర్మన్ అరవింద్ రెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న విజయ్‌కుమార్

వీధి నాటకాలను ప్రోత్సహించండి

దోమ: ప్రాచీన కాలంలో నాటి వీధి నాటకాలు ప్రజల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని, వాటిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఐనాపూర్ గ్రామంలో ప్రదర్శించిన భక్తి సిరియాల నాటకాన్ని ఆయన వీక్షించారు. అనంతరం కళాకారులకు రూ.10 వేల విరాళం అందజేశారు.

నేడు డయాలసిస్ సెంటర్ ప్రారంభం

చేవెళ్ల: చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని మంత్రి సబితారెడ్డి సోమవారం ప్రారంభించనున్నారని బీఆర్ఎస్ చేవెళ్ల అధ్యక్షుడు ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు రావాలని కోరారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపేట

శంకర్‌పల్లి: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో రైతు ఆగ్రోమార్ట్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టారని చెప్పారు. ప్రతి మండల కేంద్రాల్లో రైతు ఆగ్రోమార్ట్‌ల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులను, విత్తనాలను సరఫరా చేయనుందన్నారు. ఆగ్రోమార్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు, పర్వేద ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీనాథ్‌గౌడ్, ముకుందం, ఉపేందర్, సంజీవరెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేద్దాం

కొందుర్గు: లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాని డిమాండ్ చేస్తూ సోమవారం షాద్‌నగర్‌లో చేపట్టనున్న అఖిలపక్షం మహాధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తే ఈ ప్రాంత ప్రజల నీటి కష్టాలు తీరుతాయన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సాగునీరు, తాగునీరు లభిస్తుందని, ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని తెలిపారు. ఈ ధర్నాకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యాదయ్య, మల్లయ్య, రవి, రామస్వామి, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు నకిలీల బెడద

- నాసిరకం విత్తనాలు, ఎరువులతో మోసపోతున్న రైతులు
- జాగ్రత్తలు సూచిస్తున్న వ్యవసాయ అధికారులు



దౌల్తాబాద్‌లో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న పోలీస్, వ్యవసాయశాఖ అధికారులు(ఫైల్)

దౌల్తాబాద్: రైతులు వానాకాలం పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. దుక్కులు దున్ని పొలాలను సిద్ధంచేసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. అయితే మార్కెట్లో నకిలీల బెడద ఎక్కువగా ఉన్నందున రైతులు అప్రమత్తంగా లేకుంటే మోసపోయే ప్రమాదం ఉంటుంది. అధిక లాభాల కోసం విత్తనాలు, ఎరువుల వ్యాపారులు నాసిరకం ఎరువులు, సీడ్స్ అంటగట్టే అవకాశాలు లేకపోలేదని, రైతులు వాటిపై అవగాహన పెంచుకోవాలని, ఈ క్రింది విధంగా తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

విత్తనాలు కొనేముందు..

వ్యవసాయశాఖ లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. విక్రయదారు ఇచ్చే కరపత్రాలు తీసుకొని వాటిలో పేర్కొన్న అంశాలు చదవాలి. బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లుపై విక్రయదారు పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, తేదీలు, రకం బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికరతూకం, కంపెనీ పేరు ఉన్నాయో లేవో సరిచూసుకోవాలి. అరువు పద్ధతిలో కొనుగోలు చేసినా తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. విడిగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల విత్తనాలు కొనవద్దు. కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్ సీసీ, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి. కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్దే తూకం వేయించాలి. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు దాచిపెట్టుకోవాలి. విత్తనాలు కొనుగోలు చేసి ఇంటికి తెచ్చిన తర్వాత మొలక శాతాన్ని చూసుకోవాలి. మొలక శాతం సంతృప్తికరంగా ఉంటేనే విత్తనాలను వాడుకోవాలి.

ఎరువులు తీసుకునే ముందు..

డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి. మిషన్ కుట్టుతో ఉన్న సంచులనే ఎంచుకోవాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు ఉంటనే కొనాలి. చిల్లులు పడి, చిరిగిన బస్తాలను తీసుకోవద్దు. అన్య పదార్థాలు కలిస్తే కల్తీగా గుర్తించాలి. కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయశాఖ అధికారి సహాయంతో పరీక్షకు పంపాలి.

పురుగు మందులు..

వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగు మందులు కొనాలి. క్రిమిసంహారక డబ్బాలపై డైమండ్ ఆకారంలో పురుగుమందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపురంగు, విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులు ఉంటాయి. పురుగు మందులు రెండు మూడు రకాలు కలిపి వాడరాదు. వాడిన డబ్బాలు, సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చిపెట్టాలి. పురుగుమందుల వాడకానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు ఉపయోగించవద్దు.

సూచనలు పాటించాలి



వానాకాలం పంటల సాగుకు వినియోగించే విత్తనాలు, ఎరువులపై రైతులు అవగాహన కలిగి ఉండాలి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోళ్లలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలి.

– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

గోనె సంచుల గోస

రైతులకు గోనె సంచుల కొరత పెద్ద సమస్యగా మారింది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా.. నేటికీ పూర్తి స్థాయిలో గన్నీ బ్యాగులు అందడం లేదు. దీంతో ధాన్యాన్ని పొలాలు, రోడ్లపై కుప్పలుగా పోసి.. సంచుల కోసం కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు.

- కేంద్రాల వద్ద కర్షకుల పడిగాపులు
- బ్యాగులు లేనిదే కేంద్రాలకు ధాన్యం తెచ్చేదెలా అంటున్న రైతులు
- పొలాలు, రోడ్లపై వరికుప్పల దర్శనం



పెద్దేముల్ మండల మంబాపూర్ కేంద్రంలో పాత గోనె సంచులు

పెద్దేముల్: పంట సాగుచేయడం కంటే విక్రయించడమే చాలా కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు. కేంద్రాలు ఉంటే సంచులు ఉండవు. సంచులు, కేంద్రాలు ఉంటే హమాలీలు ఉండరు, లారీలు ఉండవు. ఇలా ఏదో ఒక సాకుతో కొనుగోళ్లు ఆపి.. చివరకు పంటను వర్షం పాలు చేసి.. మమ్మల్ని కష్టాల పాలు చేస్తున్నారని అన్నదాతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభ సమయంలో పంపిణీ చేసిన పాత బార్‌దాన్ 50శాతం కూడా పనికి రావడం లేదని, మొత్తం చిల్లులు పడి ఉన్నాయని కొందరు రైతులు వాపోతున్నారు. దీంతో సంచులు లేనిదే ధాన్యం కేంద్రాలకు ఎలా తరలించాలని ప్రశ్నిస్తున్నారు. ఏటా ఇదే సమస్యతో ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వం ముందు జాగ్రత్తగా సంచుల సమస్య ఎందుకు పరిష్కరించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇదే అంశంపై డీసీఎంఎస్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గోనె సంచులు అందక వరిని పంట పొలాలు, రోడ్డలపై ధాన్యం కుప్పలు పోసి ఎంత కాలం ఉంచాలని, అడపాదడపా వాన చినుకులు పడుతూ ఆందోళనకు గురిచేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

30 వేల పాత సంచుల పంపిణీ!

పెద్దేముల్ మండలానికి సుమారు 70నుంచి 80వేల బ్యాగులు అవసరం ఉండగా.. ప్రభుత్వం ఇప్పటి వరకు సుమారు 30 వేల వరకు (అవీ పాత సంచులు) పంపిణీ చేసింది. అవి ఎటూ సరిపోలేదు. దీంతో రైతులు మాట్లాడుతూ.. నిత్యం సంచుల కోసం కేంద్రాల చుట్టూ తిరుగుతున్నామని, సమస్య తీర్చకపోతే ధర్నా చేపడతామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభ సమయంలో గోనె సంచుల కొరత లేదని చెప్పిన అధికారులు.. సంచుల కోసం వస్తే ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై.. తాండూరు డీసీఎంఎస్ మేనేజర్ సలాంను వివరణ కోరగా.. పెద్దేముల్ తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డికి గన్నీ బ్యాగుల గురించి తెలిపామన్నారు. 24 గంటల్లో సంచుల సమస్య తీరనుందని చెప్పారు.